http://vaasthavanestham.com

# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..

News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com

సంపుటి: 1 । సంచిక: 1 । ఎడిటర్: సయ్యద్ ఖమర్ । శుక్రవారం, 21 ఆగస్టు 2026 । పేజీలు: 8 । వేల: 2 రూ

Published from Adilabad, Circulated in Hyderabad, Rangareddy, Medchal, Sangareddy, Siddipet, Medak, Nalgonda & Nizamabad

# విత్తన కంపెనీ నిలువు దోపిడీ..

## కౌలు రైతుకు తీరని అన్యాయం!

- మంచి దిగుబడి వస్తుందని నమ్మించి.. పూత రాక నిండా ముంచి..
- రూ.6 లక్షల పరిహారానికి ఇచ్చింది కేవలం రూ.1.50 లక్షలే!
- మిగిలిన రూ.4.50 లక్షల బకాయి ఇవ్వకుండా కంపెనీ ప్రతినిధుల ముఖం చాటు
- ప్రజావాణిలో కలెక్టర్‌కు, పోలీస్ స్టేషన్లలో వినతులు ఇచ్చినా అందని న్యాయం
- 'డయాల్ సీడ్స్' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని

పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో బాధితుడి ఆవేదన




వాస్తవ నేస్తం,పెద్దపల్లి : అధిక దిగుబడులు వస్తాయని నమ్మబలికారు.. తీరా పంట చేతికొచ్చే దశలో మోసం చేశారు.. నష్టాన్ని గుర్తించి పరిహారం ఇస్తామని చెప్పి ఇప్పుడు మొహం చాటేస్తున్నారు.. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.. నన్ను నిలువునా ముంచిన విత్తన కంపెనీ నుంచి రావాల్సిన మిగతా పరిహారాన్ని ఇప్పించి ఆదుకోండి సారూ.. అంటూ పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఉప్పటపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు ముస్క బుచ్చయ్య తీవ్ర భావోద్వేగంతో కన్నీటి పర్యంతమయ్యారు. బుధవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధిత రైతు తన గోడును వెళ్లగక్కారు. రైతు బుచ్చయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పటపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 947లో గల 8 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రముఖ విత్తన సంస్థ అయిన 'డయాల్ సీడ్స్' కంపెనీ ప్రతినిధులు జీఎం తిరుపతి, రాజ్‌కుమార్, స్థానిక ఏజెంట్ శివ ఆ రైతును సంప్రదించారు. తమ కంపెనీకి చెందిన 'అడమగ' వరి విత్తనాలను సాగు చేస్తే రికార్డు స్థాయిలో అధిక దిగుబడులు వస్తాయని, అన్ని విధాలా లాభదాయకంగా ఉంటుందని గట్టిగా నమ్మబలికారు. వారి మాటలను పూర్తిగా విశ్వసించిన బుచ్చయ్య, కంపెనీ ప్రతినిధుల ప్రత్యక్ష పర్యవేక్షణలోనే 8 ఎకరాల్లో ఆ విత్తనాలతో వరి సాగు చేపట్టారు.

**పూత దశలో బయటపడ్డ అసలు బండారం..**

లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుల కోసం పెట్టుబడి పెట్టారు. పంట ఏపుగా పెరిగి పూత దశకు చేరుకుంది. అయితే అనుకోని విధంగా మగ పుష్పాల నుంచి పుప్పొడి రాకపోవడంతో గింజ కట్టే ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పంట తీవ్రంగా దెబ్బతిని దిగుబడి రాని పరిస్థితి ఏర్పడింది. ఈ తీవ్రమైన సమస్యను వెంటనే స్థానిక ఏజెంట్ శివ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఆయన ఏమాత్రం బాధ్యత లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని రైతు ఆరోపించారు. దిక్కుతోచని స్థితిలో రైతు తీవ్ర నిరసన వ్యక్తం చేయడంతో చివరకు 'డయాల్ సీడ్స్' కంపెనీ ఉన్నత ప్రతినిధులు వచ్చి పొలాన్ని పరిశీలించారు. విత్తన లోపం వల్ల పంట నష్టపోయినట్లు గుర్తించిన కంపెనీ యాజమాన్యం.. ఎకరాకు రూ. 75,000 చొప్పున మొత్తం 8 ఎకరాలకు కలిపి రూ. 6 లక్షల నష్టపరిహారాన్ని రైతుకు చెల్లిస్తామని లిఖితపూర్వకంగా/మౌఖికంగా ఒప్పందం చేసుకున్నారు. అయితే ఆ తర్వాత అసలు కథ మొదలైంది. బాధిత రైతుకు మొదట కేవలం రూ. 1.50 లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మిగిలిన రూ. 4.50 లక్షల బకాయి చెల్లించకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. బాకీ మొత్తం కోసం కంపెనీ ప్రతినిధులు తిరుపతి, రాజ్‌కుమార్, ఏజెంట్ శివకుమార్‌లకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోగా, ముఖం చాటేస్తున్నారని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రజావాణి, పోలీసులను ఆశ్రయించినా శూన్యం..**

కంపెనీ మోసంతో తీవ్ర అప్పులపాలైన రైతు బుచ్చయ్య న్యాయం కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు నేరుగా లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. అలాగే సుల్తానాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)కి వినతిపత్రం అందజేయగా, ఆయన ఆ కేసును కాల్వశ్రీరాంపూర్ ఎస్సైకి బదిలీ చేశారు. అయినప్పటికీ స్థానిక పోలీసులు, అధికారులు కంపెనీ ప్రతినిధులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడంతో సమస్య అక్కడే నిలిచిపోయింది. కౌలుకు తీసుకుని సాగు చేసినందున అటు భూ యజమానికి కౌలు చెల్లించలేక, ఇటు విత్తనాలు, ఎరువుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక కుటుంబం రోడ్డున పడే దుస్థితి వచ్చిందని రైతు కన్నీరుమున్నీరయ్యారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా ఎస్పీ, కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని 'డయాల్ సీడ్స్' ప్రతినిధులను పిలిపించి విచారణ జరపాలని, తనకు రావాల్సిన మిగతా రూ. 4.50 లక్షల నష్టపరిహారాన్ని ఇప్పించాలని వేడుకున్నారు. అలాగే నకిలీ, లోపభూయిష్టమైన విత్తనాలతో అమాయక రైతుల పొట్టగొడుతున్న 'డయాల్ సీడ్స్' యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు డిమాండ్ చేశారు.

# ప్రిన్సిపాల్ రూపారెడ్డి మృతికి ప్రగతి పాఠశాల ఘన నివాళి

వాస్తవ నేస్తం,ఇచ్చోడ: మండల కేంద్రంలోని స్థానిక ప్రగతి పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి అకాల మృతి పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేసింది. పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ సురకంటి వనమాల ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత ప్రిన్సిపాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు.




ఈ సందర్భంగా కరస్పాండెంట్ సురకంటి వనమాల మాట్లాడుతూ.. రూపారెడ్డి విద్యారంగానికి అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆమె చూపిన అంకితభావం ఆదర్శనీయమని, ఆమె మరణం పాఠశాలకు, విద్యా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజుల, నిజామోద్దీన్, పీఈటీ అల్లం సాయికిరణ్ రెడ్డితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.

# ఇచ్చోడలోపోలీసుల మెరుపు తనిఖీలు

**150 మంది పోలీసులతో తెల్లవారుజాము నుంచే విస్తృత సోదాలు**

**ఫేక్ నంబర్ ప్లేట్లు ఉన్న 15 బైక్‌లపై కేసులు నమోదు**

**చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే**

వాస్తవ నేస్తం,ఆదిలాబాద్ ; జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఇచ్చోడ మండలంలోని ఇస్లాంపురలో గురువారం తెల్లవారుజామున పోలీసులు భారీ 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్' నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామంలో విస్తృతంగా సోదాలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 110 ద్విచక్ర వాహనాలు, 1 ఆటో, 4 కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఫేక్ నంబర్ ప్లేట్లు, నంబర్ ప్లేట్ లేని 15 ద్విచక్ర వాహనాలపై ప్రత్యేకంగా కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం

ఈ సందర్భంగా ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే మాట్లాడుతూ జిల్లాలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు.

- గంజాయి రహిత జిల్లా: గంజాయి నిర్మూలనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని.. గంజాయి వాడకం, నిల్వ, రవాణా లేదా విక్రయాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని తేల్చిచెప్పారు.
- పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నేరం: ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని కొనుగోలు చేసినా, అక్రమంగా నిల్వ లేదా రవాణా చేసినా కఠిన కేసులు నమోదు చేస్తామన్నారు.
- భద్రతకు సీసీ కెమెరాలు కీలకం: నేరాల నియంత్రణ కోసం కాలనీవాసులు సమన్వయంతో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.
- రోడ్డు భద్రత నిబంధనలు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చని స్పష్టం చేశారు.

ఈ విస్తృత తనిఖీల్లో ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, సీఐలు సీహెచ్ రమేష్, కే నరేష్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి. వెంకటి, టి. మురళి, ఎన్. చంద్రశేఖర్, స్థానిక ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.





Vasthava Nestham
Digetal Media